క్లుప్తంగా

హామీలను అమలు చేయాలి

ఉప్పునుంతల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తోట్ల మహేష్‌యాదవ్, నాయకులు శివకుమార్, శేఖర్, అంజనేయులుగౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీకి రేషన్‌కార్డు లింకుపెట్టడంతో ఎంతోమంది రైతులు నష్టపోయారని వాపోయారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేలు అందజేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బాలస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన నివాసంలో బాధిత కుటుంబాన్ని సత్య హరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ ఎన్.రాములు యాదవ్ పరామర్శించి 50 కేజీలు అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కుమ్మరి నిరంజన్ 50 కేజీల బియ్యం వితరణ చేశారు.

ఎస్‌ఐకి సన్మానం

చారకొండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, డీసీసీ కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, యూత్ ప్రసిడెంట్ గణేష్, మాజీ ఎంపీటీసీ నర్సింహ్మా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భీముడు, నాయకులు జేసీబీ వెంకటయ్య గౌడ్, అంజయ్య, సహదేవ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

ఏఈఓకు..

కల్వకుర్తిరూరల్: బదిలీపై వెళ్తున్న ఏఈఓ జగదీశ్వరాచారిని బుధవారం కాంగ్రెస్ నాయకులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, పాండురంగారెడ్డి, దాస్యానాయక్, దామోదర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా చిన్న హుస్సేన్

పెంట్లవెల్లి: మండల వ్యవసాయ అధికారిగా చిన్న హుస్సేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఓగా విధులు నిర్వర్తించిన రమేష్ ఉప్పునుంతల మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చారకొండ నుంచి చిన్న హుస్సేన్ బదిలీపై వచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తెలకపల్లి: ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపస్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బయలుదేరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌తో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు విజ యగౌడ్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం: కేసు నమోదు

లింగాల: విధుల్లో ఉన్న కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన పెద్ద కొత్తపల్లి మండలం యాపట్లకు చెందిన కాశన్న, యాదమ్మ, రాణమ్మపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఈ నెల 19న అచ్చంపేట డిపోకు చెందిన బస్సు అచ్చంపేట నుంచి లింగాల మీదుగా కోడేరుకు వెళ్తుండగా యాపట్లకు చెందిన ముగ్గురు వ్యక్తులు లింగాలలో బస్సు ఎక్కారు. బస్సులో కండక్టర్‌తో అకారణంగా దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్లలోకి వర్షం నీరు



మన్ననూర్: స్థానిక ఉమామహేశ్వరం కాలనీలో బుధవారం కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. సీసీ రోడ్డు ఎత్తుగా ఉండటంతో ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తుందని కాలనీవాసులు వాపోయారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

భవనాలు పూర్తయ్యేనా?

- నిధుల కొరతతో నిలిచిన పనులు
- నూతనంగా 20 గ్రామ పంచాయతీలు ఏర్పాటు



వెల్దండలో పాఠశాల భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం



కేస్లీతండాలో అసంపూర్తిగా పంచాయతీ భవనం

వెల్దండ: గ్రామీణ ప్రజలకు పాలన సౌకర్యార్థం గత ప్రభుత్వం నూతనంగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలకు భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. అవసరమైన నిధులను కేటాయించింది. గ్రామాల్లో పంచాయతీల భవన నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించినా ఇప్పటికి పనులు అసంపూర్తిగా వదిలేశారు. నిధుల కొరత కారణంగా పనులను అసంపూర్తిగా వదిలేసినట్లు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

బిల్లులు అందక..

మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటైన 20 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించడానికి గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జాతీయ ఉపాధిహామీ పథకం కింద 9 పంచాయతీలకు, గిరిజన ప్రత్యేక నిధుల కింద 11 పంచాయతీల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కొక్క భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కొన్నిచోట్ల పనులు చేసిన నేటికి బిల్లులు అందకపోవడంతో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీల వివరాలిలా..

నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో ఐదు ఏళ్లుగా అద్దె భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించేవారు. దీంతో పాలనకు అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. జాతీయ ఉపాధిహామీ పథకంలో భక్కతీపల్లి, రాఘయపల్లి, కంటోనిపల్లి, గుండాల, లింగారెడ్డిపల్లి, తిమ్మినోనిపల్లి, బండోనిపల్లి, పల్గుతండా, పోషమ్మగడ్డతండాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. 9 పంచాయతీల్లో 4 చోట్ల దాదాపుగా పనులను నిర్మించారు. మరో మూడు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. రెండో చోట్ల స్థలాల కొరత ఉండడంతో పనులను ప్రారంభించలేదు. అదే విధంగా గిరిజన ప్రత్యేక నిధుల కింద అల్లంతోటబావితండా, గాన్‌గట్టుతండా, కేస్లీతండా, కుందారంతండా, ఎంజీ కాలనీతండా, మర్రిగుంతతండా, నగారగడ్డతండా, నారాయణపూర్‌తండా, శంకరకొండతండా, సిలోనిబావితండా, ఉబ్బలగట్టుతండాలకు భవనాలు మంజూరయ్యాయి. 11 గిరిజన తండాల గ్రామ పంచాయతీలకు భవనాల్లో కేవలం కేస్లీతండాలోనే పనులు చేపట్టారు. అవి నిధుల కొరత ఉండడంతో అసంపూర్తిగానే ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలల్లో స్థలాల కొరత, టెండర్ల సమస్య ఉండడంతో 10 చోట్ల పనులను ప్రారంభించలేదు. చేసిన పనులకు బిల్లులు నేటికి అందకపోవడంతో మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

ఏళ్లుగా అద్దె భవనాల్లో..

నూతనంగా ఏర్పాటైన 20 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక భవనాలు లేవు. దీంతో గ్రామ సర్పంచ్‌లు అద్దె భవనాల్లో వారి పదవి కాలం పూర్తి చేసుకున్నారు. ఏళ్లుగా అద్దె భవనాలల్లో పంచాయతీ పాలన వ్యవస్థను నిర్వహించారు. రాబోయే సర్పంచ్‌లకు నూతన భవనాలల్లో పాలన సాగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక గ్రామ పంచాయతీలకు భవనాలను పూర్తిచేయాలని గ్రామస్తులు, నాయకులు కోరుతున్నారు.

పనులు ముందుకు సాగడం లేదు



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. నిధుల కొరత పనులు అర్థాంతరంగా వదిలేశారు. సమయానికి నిధులు అందక కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. గత ఐదేళ్ల అద్దె భవనంలోనే పాలన కొనసాగించాం. ఈ సారైన సొంతభవనాల్లో సర్పంచ్‌ల పాలనా సాగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అంజినాయక్, మాజీ సర్పంచ్, నారాయణపూర్ తండా

పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నాం..



గత ప్రభుత్వం 20 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ పనులను ప్రారంభించాం. కొన్ని పంచాయతీలకు స్థలాల సమస్య ఉన్నది వాస్తవమే. రెవెన్యూ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. కొన్ని గ్రామాల్లో నిధుల కొరతతో పనులు నిలిచాలి. నిధులు మంజూరైన వెంటనే పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

– సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, వెల్దండ

దుండగులను శిక్షించాలని నిరసన



మెడికల్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

నాగర్‌కర్నూల్ క్రైం: కోల్‌కతలో వైద్య విద్యార్థినిని హత్య చేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళ వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. వైద్యులపై దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన దుండగులను శిక్షించా డిమాండ్ చేస్తూ మంగళవారం రాత్రి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, నిరంజన్ మాట్లాడుతూ నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, బీసీ సంఘం నాయకులు మేష లక్ష్మయ్య, పబ్బతి శ్రీనివాస్, నిరంజన్ యాదవ్, శ్రీకాంత్, సుధాకర్‌గౌడ్, కొట్ర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



తాడూరు: నేషనల్ ఆయుష్ మిషన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరాన్ని బుధవారం జిల్లా ఆయుష్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద ఔషధాలు అన్ని రుగ్మతలను దూరం చేస్తుందన్నారు. శిబిరంలో 65 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హజార్ అహ్మద్, డాక్టర్ మంజుల, ఫార్మసిస్టులు మురళీకృష్ణగౌడ్, వెంకటస్వామి, గోవిందు, జహంగీర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్



లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్, ఫీవర్ సర్వేలు కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని అప్పాయపల్లిలో లింగాల సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వేను నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, అనిల్, సబ్ యూనిట్ అధికారి బిక్‌లాల్, రాంచందర్, మల్లేష్, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో మంగళవారం రాత్రి పిడుగుపాటుకు రైతు బూరం విష్ణుకు చెందిన మూడు జెర్సీ ఆవులు మృతి చెందాయి. వాటి విలువ రూ. 2.40 లక్షలు ఉంటుందని బుధవారం పంచనామా నిర్వహించిన ఎంఆర్‌ఐ సుజాత తెలిపారు. రోజుమాదిరిగానే పొలంలో తాళ్లతో కట్టేసి ఉంచిన ఆవుల సమీపంలో పిడుగుపడటంతో దాని ప్రభావానికి అక్కడిక్కడే చనిపోయాయి. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నట్లు బాధిత రైతు తెలిపాడు. పాడి కోసం ఇటీవలే ఒక్కొక్కటి రూ.80 వేలు పెట్టి కొనుగోలు చేసి తెచ్చినట్లు బాధిత రైతు తెలిపాడు.

లింగసానిపల్లిలో భారీవర్షం

కల్వకుర్తిరూరల్: మండలంలోని లింగసానిపల్లిలో బుధవారం భారీ వర్షం కురువగా పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. లింగసానిపల్లిలో గడ్డివాము సమీపంలో పిడుగుపడింది. పిడుగు పడిన చోట చిన్నపాటి రంధ్రం ఏర్పడింది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మాజీ కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్‌కరీం, రంగినేని జగదీశ్వరావులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చే విధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పోడెండ్ల సురేష్, చామంతి రాజు, మాజీ వార్డు సభ్యుడు ఆదిరాజు, మిద్దె రామకృష్ణ, పోడెండ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీడీఓ కథలప్ప అన్నారు. బుధవారం మండలంలోని గౌరారంలో సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగకుండా చూడాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు అబ్దుల్, సలీం, యాదగిరి పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

చారకొండ: మండలంలోని సారంబండ తండా, తిమ్మాయిపల్లి, బొమ్మల గుడిసెలు, జూపల్లి ప్రభుత్వ పాఠశాలలను బుధవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాల పరిసరాలను, విద్యార్థులు నిత్యం హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు తెలిపారు. వారి వెంట సీఆర్‌పీ యాదయ్య గౌడ్, ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆరోగ్యమిత్రల నిరసన

నాగర్‌కర్నూల్ క్రైం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆరోగ్య మిత్రల సమస్యలపై ఆరోగ్యశ్రీ ట్రస్టుకు సమ్మె నోటీసు ఇచ్చి 15 రోజులు గడుస్తున్న అధికారులు చర్చలకు పిలవకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహేష్, పరశురాములు, పారిజాత, సుజాత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



పోతురాజుల విన్యాసాలు



తెలకపల్లి మండలం రాకొండలో..

తెలకపల్లి: మండలంలోని రాకొండలో మంగళవారం రాత్రి బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి ర ప్పించిన కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి, సిర్సవాడ గ్రామాల్లో ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవతలకు నైవేద్యం సమర్పించారు. గ్రామ వీధుల వెంట బోనాలతో ర్యాలీ నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 విద్యాసంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శివగంగ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సంబంధించిన మధుర స్మృతులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిషోర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, బాలస్వామి, రాంచంద్రయ్య, శంకర్, శ్రీనివాసులు, సురేష్‌బాబు, రాజారత్నం, బాల్‌రాజు, విజయ్, ఏలీశ, లక్ష్మి, సుమతి, ఇందిర, చంద్రయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పొప్పులను సవరించాలి



మాట్లాడుతున్న చారకొండ తహసీల్దార్ ప్రమీల

చారకొండ: ఓటరు జాబితాలో తప్పొప్పులను సవరించాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ కేసీ ప్రమీల సూచించారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి మరణించిన వారి పేర్లు నమోదు చేయాలన్నారు. నూతన ఓటర్లు ఆన్‌లైన్, సంబంధిత బీఎల్‌ఓల వద్ద సంబంధిత ఫారం నమోదుతో అవకాశం ఉందని, నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీను, ఆర్‌ఐ రామకృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ చెన్న కిష్టన్న బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలోని మరణించిన, డబుల్ ఓటర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్ చంద్ర, రాఘవేందర్, వివిధ గ్రామాల బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్ ఆనంద్‌జీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చాలన్నారు. రైతులను మోసం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, ఎస్‌ఎండీ ఫయాజ్, కేశవులు గౌడ్, నర్సింహ, విజయుడు, ఏసయ్య, కొమ్ము భరత్, ఇందిరమ్మ, శ్రీనివాసులు, కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నేడు రైతు ధర్నా

అచ్చంపేట: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 22న గురువారం అచ్చంపేటలో కేటీఆర్ పిలుపు మేరకు రైతు ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి విద్యా, ఉద్యోగాలలో ఆర్డినెన్స్ తెచ్చి భర్తీ చేయాలని తెలంగాణ దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్ రాజు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన రామాపురంలో దళిత దండు నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగాలలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేల వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

29న క్రీడా పోటీలు

కొల్లాపూర్: పట్టణంలో ఈ నెల 29న పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తునట్లు ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మార్సీ కేంద్రంలో మండలంలోని పీఈటీలతో క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. వసతి, సౌకర్యాలను చర్చించారు. అనంతరం ఇటీవల పదోన్నతులు పొందిన పీఈటీలను ఎంఈఓ సత్కరించారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటయ్య, రామన్‌గౌడ్, రంగినేని శ్రీధర్, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఎంఐఎస్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



కొల్లాపూర్‌లో బస్టాండ్ గేట్ ఎదుట నిరసన

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం బంద్ పాటించారు. కొల్లాపూర్, బిజినేపల్లి, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, కల్వకుర్తి, కోడేరు, పెంట్లవెల్లి, లింగాల, వెల్దండ, ఉప్పునుంతల, మన్ననూరులలో విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలను బంద్ చేయించారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ బస్ డిపో ఎదుట బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్ గేట్‌ముందు ధర్నా నిర్వహించారు. అచ్చంపేటలో రాస్తారోకో నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వెల్దండలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. కల్వకుర్తి మండలం మహబూబ్‌నగర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. పెంట్లవెల్లిలో రాస్తారోకో చేశారు. లింగాలలో తహసీల్దార్ సబితారాణి, ఎంపీడీఓ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. మాలల ఐక్యవేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోహర్ రావు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



వెల్దండలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు